ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 4 : తల్లిదండ్రులకు దూరంగా ఉండి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆమె బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం డైనింగ్ హాల్, స్టోర్‌రూంలను పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా అవుతున్న కూరగాయలను ఆమె పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, టెండర్లలో పేర్కొన్న విధంగా కిరాణ వస్తువులు, నాణ్యమైన పప్పు దినుసులు మాత్రమే తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలు దృష్టిలో పెట్టుకొని సిబ్బంది జాగ్రత్తతో ఉండాలన్నారు. విద్యార్థులకు తప్పని సరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే దవాఖానకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు అందించాలని అన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, వార్డెన్ రేష్మా ఉన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేత

విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 4 : జిల్లా కేంద్రంలోని 'మన ఊరు' ఫౌండేషన్ గర్గుల్ వారి ఆర్థిక సహాయంతో హాకీ క్రీడా సామగ్రిని గర్గుల్ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మన ఊరు ఫౌండేషన్ అధ్యక్షుడు సున్నపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొలిమి సురేశ్‌రెడ్డి, సలహాదారులు భీంరెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి, ప్రభాకర్, జగన్నాథన్, పాఠశాల పీఈటీ నోముల మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సామ్యుల్, సుగుణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్

భిక్కనూరు, డిసెంబర్ 4 : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ అన్నారు. సౌత్ క్యాంపస్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలన సంస్థ ముద్రించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు అంజయ్య, హరిత, హాస్టల్ వార్డెన్ సునీత, వైశాలి, అధ్యాపకులు మోహన్ బాబు, లలిత తదితరులు పాల్గొన్నారు.

'మందికృష్ణ మాదిగను విమర్శిస్తే సహించం'

బాన్సువాడ, డిసెంబర్ 4 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను విమర్శిస్తే సహించబోమని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెక్క సాయిలు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులు తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. 30 ఏండ్లు అలుపెరుగని పోరాటం చేసి, సామాజిక న్యాయమైన ఎస్సీవర్గీకరణను సాధించిన యోధుడు మందకృష్ణ అని అన్నారు. స్వార్థ బుద్ధితో వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావడం కోసమే పరేడ్ గ్రౌండ్‌లో మాలల సభను నిర్వహించారని పేర్కొన్నారు. మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసి, వ్యక్తిగతంగా విమర్శిస్తే జరుగబోయే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హిందువులు ఐక్యంగా ఉండాలి

ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

కామారెడ్డి, డిసెంబర్ 4 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జిల్లా కేంద్రంలో కామారెడ్డి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జేపీఎన్ విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శివకుమార్, పట్టణ ప్రజలు, హిందూ ఐక్యవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి, డిసెంబర్ 4 : కామారెడ్డి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన ఉదయం 7 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్ మోహన్, ప్రధాన కార్యదర్శి నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి 80 ఏండ్లు పైబడినవారు పురుషులు, మహిళా క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 100, 200, 400, 800, 1500, 5000, 10,000 మీటర్ల పరుగు పందెం, 5000 మీటర్ల నడక, హైజంపు, లాంగ్ జంప్, షాట్ పుట్‌త్రో, డిస్కస్ త్రో, జావలిన్ త్రోలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపికైన క్రీడాకారులను జనవరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బీడీ సెంటర్ తరలింపు ఉపసంహరణ

మాచారెడ్డి, డిసెంబర్ 4 : పాల్వంచలో ఉన్న లాంగర్ బీడీ సెంటర్‌ను తరలించొద్దని తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ ఆందోళనతో యాజమాన్యం దిగి వచ్చి బీడీ సెంటర్ తరలింపును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిందని తెలంగాణ బహుళజన బీడీ కార్మికసంఘం, బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు తెలిపారు. బీడీ కార్మికులు, యాజమాన్యంతో బుధవారం సమావేశం నిర్వహించారు. బీడీ కంపెనీ జనరల్ మేనేజర్ ఉమాకాంత్, సత్యపాల్ కార్మికుల సమక్షంలో చర్చలు జరిపి బీడీ సెంటర్ తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. బీడీ కార్మికులకు అన్యాయం చేయబోమని ప్రకటించడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగారపు ఎలయ్య, ముద్రకోల ఆంజనేయులు, టేకేదార్లు నరహరి, శ్రీనివాస్, ప్యాకర్లు కుమ్మరి రవి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యజమానులతో మాట్లాడుతున్న బీడీ కార్మిక సంఘం నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు

కామారెడ్డి, డిసెంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. బుధవారం పలు హాస్టళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా ఎత్తివేసే కుట్రలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, దయాకర్, ప్రవీణ్, నిరంజన్, యోగేశ్, సచిన్, బాలరాజ్, రాజేందర్, శ్రీధర్, మోహన్, రవితేజ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, డీఎఫ్‌వో నిఖిత

మాచారెడ్డి, డిసెంబర్ 4 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా మాచారెడ్డి రిజర్వ్ ఫారెస్ట్ చుక్కాపూర్‌లో నిర్వహించిన వనదర్శిణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారిణి నిఖిత, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపీబాబు, మాచారెడ్డి రేంజ్ అధికారిణి దివ్య, అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అనిల్ కుమార్‌కు డాక్టరేట్

కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న రాష్ట్ర డీజీపీ జితేందర్

కామారెడ్డి, డిసెంబర్ 4 : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్ కుమార్ ఇటీవల జంతు శాస్త్రంలో డాక్టరేట్‌ను సాధించారు. రాజస్థాన్‌లోని మాధవ్ యూనివర్సిటీలో పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీ ఆయనను అభినందించారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 4 : ప్రజల సౌకర్యార్థం బాన్సువాడ నుంచి వేములవాడకు ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంటల పరిశీలన

రాజంపేట్, డిసెంబర్ 4 : మండలంలోని ఆర్గొండలో శనగ పంటలను ఏవో శ్రుతి బుధవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, సంతోష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్ పాం అంతర పంటల పరిశీలన

పంటలను పరిశీలిస్తున్న ఏఈవోలు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 4: మండల కేంద్రంలో సాగు చేస్తున్న ఆయిల్ పాం అంతర పంటలను బుధవారం ఏఈవో ప్రశాంత్‌కుమార్, రవికుమార్ పరిశీలించారు. ఆయిల్ పాంలో అంతర పంటలుగా పెసర, మినుములో పచ్చ దోమ పోటు ఆశించినట్లు ఆయన చెప్పారు. నివారణ కోసం ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరానికి 330 మిల్లీమీటర్లను తీసుకొని 200 లీటర్ల నీటిలో కలిపి సాయంత్రం వేళలో పిచికారీ చేయాలన్నారు. వాటితో పాటు ఎకరం పంటలో అక్కడక్కడ ఎనిమిది చోట్ల పసుపు రంగు పూసిన ఎల్లో ట్రాప్స్ పెట్టడం ద్వారా దోమ పసుపు రంగుకు ఆకర్షితులై..దానికి అంటుకొని చనిపోతుందన్నారు. కార్యక్రమంలో డీటీఎం షఫీ, రైతులు రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

బైరం వందన (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 4: పెండ్లి బట్టలు కొనుగోలు చేయడానికి కామారెడ్డికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని మాచాపూర్‌లో చోటుచేసుకొన్నది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం..గ్రామానికి చెందిన బైరం ప్రేమ అనే మహిళ పెద్దకూతురైన వందన మూడేండ్లుగా కామారెడ్డిలో శిశురక్ష చిన్నపిల్లల దవాఖానలో పని చేస్తున్నది. వందనకు రెండు నెలల క్రితం నాగిరెడ్డిపేట్ మండలం రామక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో నిశ్చితార్థమైంది. ఈనెల 2న సాయంత్రం 5 గంటల సమయంలో పెండ్లిబట్టలు కొనుగోలు చేసి, అక్కడి నుంచి డ్యూటీకి వెళ్తానని చెప్పి వెళ్లింది. 3వతేదీ వందన కుటుంబసభ్యులు పెండ్లి పనుల కోసం కామారెడ్డికి వందనను కలవడానికి దవాఖానకు వెళ్లారు. వందన దవాఖానకు రాలేదని సిబ్బంది తెలపడంతో వెంటనే వందనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మండలంలో కలెక్టర్ పర్యటన

రామారెడ్డి డిసెంబర్ 4 : సదాశివనగర్ మండలంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ నేడు (గురువారం) పర్యటించనున్నారని మండల ఐకేపీ ఏపీఎం రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I BODAS CHINNA NARSAIAH S/O NARSIMLU R/O H.no 4-2/2 Chittapur Balkonda,Nizamabad. I Have Changed My Name /Surname As **BODAS NARSAIAH.**
NTZ-338234

PLOT FOR SALE
★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

WANTED
★ స్కూల్ పిల్లల బట్టలు వాషింగ్ మెషిన్‌పై ఉతికి ఇస్త్రీ చేయుటకు రజకులు కావలెను. ఉచిత వసతి, భోజన సౌకర్యం కలదు. సంప్రదించు సెల్:9440758535, 9010286434
NTZ-334432

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆన్‌లైన్‌తో గ్రామ కార్యదర్శులకు తిప్పలు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 4: సమగ్ర సర్వే ఆన్‌లైన్ ఇబ్బందులతో గ్రామ కార్యదర్శులు తిప్పలు పడుతున్నారు. ఆన్‌లైన్ సర్వేలో కేవలం గ్రామ కార్యదర్శులు మాత్రమే పనులు చేస్తుండడంతో..జిల్లాలోనే నాగిరెడ్డిపేట వెనకబడి ఉండటంతో..జిల్లా అధికారులతో తిట్లు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులతో పాటు ఉపాధ్యాయులు, రెవెన్యూ, ఉపాధిహామీ, ఐకేపీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి సర్వే ఆన్‌లైన్ చేయవలసి ఉండగా భారం పూర్తిగా గ్రామ కార్యదర్శులపై పడుతున్నదని వాపోతున్నారు. మండలంలోని 10,546 కుటుంబాల సర్వే కోసం 78 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇద్దరు సబ్‌ఆర్డినేట్‌తో కలిసి సర్వే పూర్తి చేశారు. ఆన్‌లైన్ బాధ్యతలను గ్రామాల వారీగా విభజించి సర్వే చేసిన సిబ్బందికి అప్పగించారు. అందులో ఇప్పటి వరకు గ్రామ కార్యదర్శులకు ఇచ్చిన డాటా మాత్రమే పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ అ యినట్లు చెబుతున్నారు. మిగతా వారు స్పందించకపోవడంతో.. ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎంపీడీవో ప్రభాకర్‌తో మొరపెట్టుకుంటున్నారు. తాము ఉద్యోగం చేయాలంటేనే భయం వేస్తున్నదని, గ్రామాల్లో ప్రతి రో జు తమ బాధ్యతలతో పాటు ఈ పనులు చేస్తున్నామని, మిగతా వారికి కేటాయించిన డాటాను తమకే ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. సర్వేలో పాల్గొన్న సిబ్బందితో పని చేయిస్తే రెండు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామంటున్నారు.

సర్వే చేపట్టని నివేదికలను గ్రామ కార్యదర్శులకు కేటాయిస్తున్న అధికారులు

చెట్లు నరికితే వన్యప్రాణులకు ముప్పు

ఎల్లారెడ్డి రూరల్/గాంధారి/నాగిరెడ్డిపేట, డిసెంబర్ 4: అటవీ సంపదను సంరక్షించుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, చెట్లను నరికినా, నిప్పుపెట్టినా వన్యప్రాణి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఎఫ్ఆర్‌వో ఓంకార్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్ అటవీప్రాంతంలో విద్యార్థులకు అడవికి నిప్పు – నివారణ చర్యలపై అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులకు అడవి ప్రాంతమంతా తిప్పి చూయించారు. ఆయనతో పాటు సెక్షన్ ఆఫీసర్ విక్కీమార్టిన్, బీట్ అధికారులు శ్రీనివాస్, అనిత, పర్వీన్, నవ్య, శ్యాంసుందర్, పిచ్చమ్మ, శేఖర్, అనిత, స్ట్రైక్ ఫోర్స్ జీవన్, పట్టణానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధారి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండలంలోని రాంపూర్ గడ్డ సమీపంలోని అటవి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అటవీ అధికారులతో కలిసి అడవిలో పెరుగుతున్న రకరకాల మొక్కలు, చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధారి అటవీ రేంజ్ అధికారిణి హేమ చందన అడువులతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడవుల సంరక్షణ, అడవి జంతువుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అడవులను సంరక్షించుకొంటేనే మానవ మనుగడ ముందుకు సాగుతుందని నాగిరెడ్డిపేట ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్ అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సం పురస్కరించుకొని బుధవారం నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్షేత్ర స్థాయి అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ మనుగడ అడవులు ఉంటేనే సాధ్యం అవుతుందన్నారు. అందుకోసం చెట్లను నరకవద్దనీ.. సంరక్షించాలన్నారు. అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. వాటి నివారణ కోసం పాటించవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఫారెస్టు బీట్ అధికారులు నవీన్, సమ్రిన్ తదితరులు ఉన్నారు.

లక్ష్మాపూర్ అటవీప్రాంతంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో ఓంకార్

ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

గాంధారి, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఐఎస్ఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, సామాజిక మాధ్యమాల వినియోగం, సైబర్ మోసాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాంధారి ఎస్సై ఆంజనేయులు సైబర్ నేరాలు, ఆడ పిల్లలకు గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఐఎస్ఆర్డీ సంస్థ అధ్యక్షురాలు రవళి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన..

నాగిరెడ్డిపేట : మండల కేంద్రం గోపాల్‌పేట బస్టాండ్ వద్ద సైబర్ నేరాలపై బుధవారం ఏఎస్సై ఉమేశ్ ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త నంబర్లతో ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయవద్దన్నారు. రైతులు బ్యాంకుకు వచ్చి లావాదేవీలు చేసుకోవాలని సూచించారు.

కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసిన మున్సిపల్ మాజీ చైర్మన్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 4: ఎల్లారెడ్డి ప్రథమ మున్సిపల్ చైర్మన్, 7వ వార్డు కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ బుధవారం తన వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా చేస్తున్నానని, తన హయాంలో ఎల్లారెడ్డి పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామప్ప, మామిడి రవీందర్, దుద్దుల సాయిరాం తదితరులున్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రామారెడ్డి డిసెంబర్ 4 : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సదాశివనగర్ మండలం మర్కల్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి సూచించారు. బుధవారం ఆమె నార్కోటిక్ బ్యూరో రూపొందించిన గోడప్రతులను కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడారు.

10 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

నాగిరెడ్డిపేట, డిసెంబర్4: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల క్రీడాప్రాంగణంలో ఈనెల 10 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రభాకర్ బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 10 నుంచి 12 వరకు క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అండర్ –14, 17,19 యువతీ, యువకులకు క్రీడలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆకస్తిఉన్న వారు గ్రామ కార్యదర్శుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏంఈవో భాస్కర్, సూపరింటెండెంట్ వినోద్ తదితరులు ఉన్నారు.

అవగాహనా సమావేశం..

ఎల్లారెడ్డి రూరల్. డిసెంబర్4: మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో సీఎం కప్ నిర్వాహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. సీఎం కప్ 2024లో భాగంగా ఈ నెల 7 నుంచి 12 వరకు గ్రామ, మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు సమీపంలోని మీసేవ కేంద్రం నుంచి గాని, మొబైల్ లేదా website.cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీఎం కప్–2024 పై సమావేశం..

నిజాంసాగర్ డిసెంబర్4 : మండల కేంద్రంలో గ్రామ కార్యదర్శులకు సీఎం కప్–2024, గ్రామ పంచాయతీ ఎన్నికలపై మండల ప్రత్యేకాధికారి పిల్లి శ్రీపతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీపతి మాట్లాడుతూ.. సీఎం కప్ – 2024 కోసం పాఠశాలల్లో ఆటలు నిర్వహించి గెలుపొందిన వారిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపుతామని వివరించారు. సమావేశంలో ఎంఆర్‌వో, ఎంపీడీవో, పీడీ), తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

నాగన్న బావిని సందర్శించి అధికారులకు సూచనలు చేస్తున్న డీఆర్డీవో సురేందర్

లింగంపేట, డిసెంబర్ 4: నాగన్న బావి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేక అధికారి, కామారెడ్డి డీఆర్డీవో సురేందర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని నాగన్న బావిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాగన్న బావి పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. సందర్శకుల సంఖ్య నిత్యం పెరుగుతున్నదని వెల్లడించారు. పరిసరాల్లో చెత్త చెదారం ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఎంపీవో మల్లూరీ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లింగంపేట, డిసెంబర్ 4: మండలంలోని లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్యాణ లక్ష్మి చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు కొండాపూర్, ముంబాజీపేట, జల్దిపల్లి, రాంపూర్, మెంగారం, బోనాల్, లింగంపేట గ్రామాల్లోని 21 మంది లబ్ధిదారులకు 24లక్షల 36వేల రూపాయల విలువైన చెక్కులను వారి